క్లుప్తంగా

చెట్ల కొమ్మల తొలగింపు



పోలవరంలో విద్యుత్ వైర్లపై పడిన చెట్లకొమ్మలను నరుకుతున్న విద్యుత్ సిబ్బంది

పోలవరం రూరల్: పోలవరంలో విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టారు జుజీ. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ వైర్లపై పడే చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. విద్యుత్ అంతరాయాలను నివారించే కార్యక్రమంలో భాగంగా వీటిని తొలగిస్తున్నట్లు విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



బుట్టాయిగూడెం జట్టుకు నగదు బహుమానం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ (టెన్నిస్ బాల్) పోటీలలో బుట్టాయిగూడెం జట్టు విజేతగా నిలిచింది. అంకాలగూడెం గ్రామంలో నిర్వహించిన గంట సూర్యచంద్ర యువసేన మెమోరియల్ క్రికెట్ పోటీల్లో జంగారెడ్డిగూడెం జట్టుపై విజేతగా నిలిచింది. పద్దెనిమిది రోజులపాటు టోర్నమెంట్‌ని నిర్వహించగా ఇందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి 18 జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 15 వేలు, రన్నర్‌కు రూ. 10వేలు నగదును నిర్వాహకులు మెమెంటోలతో కలిపి అందజేశారు.

మానవత ఆర్థిక సహాయం



కొయ్యలగూడెంలో పల్లవికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవతా సంస్థ సభ్యులు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మానవతా మండల శాఖ సభ్యులు శుక్రవారం ఆర్థికపరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్లో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కొత్త సాయి పల్లవి మూడు వేల రూపాయలు నగదు అదే విధంగా, ప్రైవేటు ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ ప్రమాదానికి గురైన అంకాలగూడెం గ్రామవాసి చిడిపి చిన్న వెంకటేష్‌కి మరో మూడు వేల రూపాయలు సభ్యులు అందించారు. కార్యక్రమంలో నిడదవోలు రామారావు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, మాటూరి రాధాకృష్ణ, బొమ్మబాబు, బోనగిరి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీగిరిలో కల్యాణ మహోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

పోలవరం రూరల్: మండలంలోని బోడిగూడెం గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బూరుగుపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీగిరి కొండపై వెలసిన ఈ దేవాలయానికి కాలినడక మార్గంతో పాటు, కొండపైకి వాహనాలు వెళ్లేందుకు మార్గం ఉందని పేర్కొన్నారు. స్వామి వారి గిరి ప్రదక్షిణ, కల్యాణ మహోత్సవాలు సామూహికంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదానాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైభవంగా వాసవీమాత జయంతి



కొయ్యలగూడెం వాసవీమాత ఆలయంలో కలశాలతో భక్తులు

కొయ్యలగూడెం: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. టెంపుల్స్ సెంటర్లోని అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 102 మంది మంది కన్యలతో కలశ పూజ నిర్వహించారు. కన్యల పూజకు కావాల్సిన కలశపు చెంబును, పూజా ద్రవ్యాలను కమిటీ అందజేసింది. శనివారం తెల్లవారుజామున అమ్మవారి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు, శ్రీ వాసవి శాంతి హోమము, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో అన్న సమారాధన నిర్వహిస్తారు.

పదో తరగతి శిక్షణ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



బుట్టాయగూడెం మండలం ఎస్ఆర్‌పాలెంలో నిర్వహిస్తున్న పదో తరగతి శిక్షణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: మండలంలోని రాజానగరం, నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల నిర్వహణ కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పాలెం పాఠశాలలో 90 మంది విద్యార్థులకు గానూ 42 మంది విద్యార్థులు మాత్రమే తరగతులకు హాజరవుతున్నట్లు గుర్తించారు. విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాల్సిన ఎస్ఆర్‌పాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కోర్స్ డైరెక్టర్ బి. శ్యాంబాబును సంజాయిషీ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పాఠశాలల పరిధిలో ఉన్న సబ్జెక్ట్ టీచర్‌లను పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కేటాయించినట్లు పీఓ తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మొత్తం 197 మంది ఉన్నారని వారందరికీ ఏప్రిల్ 30 నుంచి పరీక్షలు ముగిసే వరకు ఈ ప్రత్యేక శిక్షణలు ఇస్తామని చెప్పారు. ఈ శిక్షణా తరగతులను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అలాగే ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోర్సు డైరెక్టర్‌లను ఆదేశించారు. అలాగే విధి నిర్వహణలో అలసత్వం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీడీ పీవీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు





డయేరియా బాధిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం, కురుమలు తోగులో బోరును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు డయేరియా తో బాధపడుతున్న నేపథ్యంలో శుక్రవారం నుండి మూడు రోజుల పాటు కుక్కునూరు వేలేరుపాడు మండలాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా డ్రెయినేజీ పూడికతీత, పైప్ లైన్ లీకేజీలను అరికట్టడం, చెత్త కుప్పల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయడం, మురుగుగుంటల్లో స్ప్రేయింగ్ చేయించడం వంటి పనులు చేపట్టినట్టు చెప్పారు. ఇప్పటికే డయేరియాతో బాధపడుతున్న కురుములతోగు కొత్తూరు గ్రామాల్లో సూపర్ శానిటేషన్ పనులు చేపట్టినట్టు చెప్పారు.

కురుముల తోగులో బోరు ఏర్పాట్లు

తాగునీటి సమస్యతో బాధపడుతున్న కురుముల టోగు గిరిజన గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం బోరు ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారు. బోరు సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు తాగి అనారోగ్య బారిన పడుతున్నట్టు గిరిజనులు గ్రామాన్ని సందర్శించిన ఐటీడీఏ పీఓ ఎం.సూర్య తేజకు చెప్పడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అంతే కాక గ్రామస్తులకు నీటిలో వేసుకునేందుకు క్లోరిన్ టాబ్లెట్లు అందించారు. శుక్రవారం కూడా మెడికల్ క్యాంపు నిర్వహించారు.

19 నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు





గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, కల్యాణం నిర్వహించనున్న వేదిక

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో పునఃనిర్మించిన విషయం అందరికీ తెలిసింది. 80 ఏళ్ల కితం నిర్మించిన కల్యాణ మండపానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 21వ తేదీ రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల వేడుకగా ఘనంగా నిర్వహించున్నారు. ఈ కల్యాణాన్ని వీక్షించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ అర్చకుడు మంగపతి అచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 19వ తేదీ ఆదివారం స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నారు. 20వ తేదీ సోమవారం నవకుంభారాధన పూజలు చేస్తారు. 21వ తేదీ మంగళవారం రాత్రి కీర్తిశేషులు వగ్వాల వెంకట రామారావు, వగ్వాల మాధవరాయుడు సహకారంతో నిర్మించిన కల్యాణ మండపంలో ఈ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసారు. ఎదురు సన్నాహం కార్యక్రమాన్ని మొగల్ల బాబు బంగారు లక్ష్మీ, నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరగనుంది. ఈనెల 22వ తేదీ బుధవారం ఊరేగింపు, గరుడోత్సవం, 23వ తేదీ గురువారం చక్రస్నానం, పూర్ణాహుతి పూజలు, 24వ తేదీ శుక్రవారం పుష్పోత్సవం, ద్వాదశి కోవెల ప్రదక్షిణ పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 26వ తేదీ ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనా కుమారి అచ్యుతరామారావు, ఆలయాధికారులు తెలిపారు.

అపరాల సాగుపై యాంత్రీకరణ ప్రభావం



యాంత్రీకరణతో గోతులమయంగా మారుతున్న సాగు భూములు

పెదవేగి : ఏటా తగ్గుతున్న అపరాల సాగు పప్పు ధాన్యాల కొరతను పెంచుతోంది. యంత్రాలతో వరి కోతల వల్ల ఒక పక్క పశుగ్రాసానికి మరో పక్క అపరాల సాగుకు ముప్పు ఏర్పడుతోంది. మరోవైపు సాగునీటి ఎద్దడికి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో అపరాలు సాగు చేసే పరిస్థితి లేకుండా పోతోంది. యాంత్రీకరణతో అనేక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారుల ప్రచారంతో యాంత్రీకరణ అనూహ్య రీతిలో పెరిగింది. ఈ పరిస్థితి రైతులకు ఒక విధంగా మేలు చేస్తుండగా అపరాల సాగుపై మాత్రం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

పశుగ్రాసానికి ఇబ్బందులు

దెందులూరు నియోజకవర్గంలో వరిసాగులో యాంత్రీకరణ పెరగడంతో పెట్టుబడి రైతులకు ఒక రకంగా లాభం కలుగుతున్నా అపరాల సాగుపై తీవ్ర ప్రభావం పడి సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. యంత్రాలతో కోసిన పొలాల్లో గడ్డి ఉపయోగపడకపోవడంతో పశుగ్రాసానికి రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. కోత యంత్రాలవల్ల మడుగు గోతులు పడి అపరాల సాగుకు ఏ మాత్రం అనుకూలంగా లేకుండా తయారవుతున్నాయి. సాధారణంగా రైతులు కోతలకు రెండురోజుల ముందుగా నానబెట్టి మొలకలు వస్తున్న అపరాలను చల్లుతారు. కోతలు పూర్తయిన వెంటనే అవి మొలకెత్తి మొక్కలుగా తయారవుతాయి. యంత్రాలతో కోతలు కోస్తున్న పొలాలు గోతులు పడడంతో పాటు యంత్రం వరి దుబ్బులను నలిపివేయడం, భూమిపై ఒత్తిడి తేవడం వల్ల అపరాలను వేసినా మొక్కలు రావడం లేదు. దీంతో ఈ పొలాల్లో రైతులు అపరాల సాగు నిలిపి వేస్తున్నారు.

చీడపీడలూ ఒక కారణం

అపరాల సాగుకు అధిక శాతం చీడపీడల వల్ల నష్టం వాటిల్లుతోంది. కొన్నేళ్లుగా అపరాల పంటలకు తెగుళ్లు పట్టి పీడిస్తున్నాయి. దీంతో రైతులు అపరాలు సాగుకు వెనుకంజ వేస్తున్నారు. నష్టాన్ని భరించే బదులు సాగు చేపట్టకపోవడం మంచిదని అధిక శాతం రైతులు భావిస్తున్నారు. దీంతో పప్పు ధాన్యాల ఉత్పత్తి పడిపోతోంది. వచ్చిన నష్టాన్ని పాలకులు ఆదుకోనందున అపరాల సాగు చేయడం కష్టంగా ఉందని రైతులు అంటున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

నియోజకవర్గంలో 4,900 వేల హెక్టార్లలో రబీ సాగు చేస్తుంటారు. ఏటా సుమారు 2,300 వేల హెక్టార్లలో అపరాల సాగు చేస్తుంటారు. ఐదేళ్ల నుంచి అపరాల సాగు క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది రబీలో 4,050వేల హెక్టార్లలో అపరాల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖాధికారులు నిర్ణయించగా, ఇప్పటికీ వెయ్యి ఎకరాల్లో మాత్రమే అపరాల సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఆలస్యం కూడా కారణమే

ప్రస్తుత సాగు విధానంలో వచ్చిన మార్పులు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రబీ సాగు ఆలస్యం కావడం కూడా అపరాల సాగుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. సాధారణంగా ఏటా డిసెంబర్ నాటికి ఖరీఫ్ కోతలు పూర్తయ్యి జనవరిలో రబీ నాట్లు పూర్తయితే అపరాల సాగు సక్రమంగా ఉంటుంది. అపరాల పంట కాల పరిమితి 60 నుంచి 70 రోజులు కావడంతో మార్చి నెలాఖరుకల్లా రబీ కోతలు పూర్తయితే ఎండలు ముదురుతున్నా భూమిలో తేమకు మంచి దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఏప్రిల్ నెలాఖరు వరకు రబీ కోతలు పూర్తి కాకపోవడంతో అపరాలు వేసినా నాటుకునే పరిస్థితి తక్కువగా ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తెగుళ్లను తట్టుకునే విత్తనాల తయారీని రైతులు విస్మరించడంతో అపరాల సాగు భారీగా తగ్గిపోయిందంటున్నారు. అపరాల సాగుపై అవగాహన పెంచి అపరాల ఉత్పత్తి పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉపాధి పనుల తనిఖీ

దెందులూరు: గ్రామాల్లో కూలీలు ఎండబారిన పడకుండా త్వరితగతిన పనులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరాలని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. శుక్రవారం సానిగూడెంలో ఉపాధి పనులను, మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీల్లో 9,946 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు చేస్తున్న పనులను, మస్టర్లను జవాబుదారీతనంగా తనిఖీ చేయాలన్నారు. సానిగూడెం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు మద్దా జయరాజు, మేట్లు ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సెరీకల్చర్ దోహదం



మల్బరీ సాగును పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వాణి

దెందులూరు: మెట్ట ప్రాంత రైతులు, మల్బరీ సాగును సద్వినియోగం చేసుకుని కేంద్ర ప్రభుత్వ రాయితీలను పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వాణి అన్నారు. శుక్రవారం రామారావుగూడెంలో దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ పి.రత్తయ్యతో కలిసి మల్బరీ సాగు తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మల్బరీ సాగు ఎకరానికి రూ.3.14 లక్షలు మంజూరైందని, సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.3.60 లక్షలు, వడ్డీకి రూ.41 వేలు, ప్లాంటేషన్‌కు రూ.27 వేలు, అదనంగా రూ.30 వేలు మంజూరు చేసినట్టు తెలిపారు. మెట్టప్రాంత రైతులు సెరీకల్చర్ ద్వారా రైతులు గణనీయంగా దిగుబడి, ఆర్థికాభివృద్ధి, సాధించడాన్ని పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సాగు, జీవనం, అభివృద్ధి, భద్రత లక్ష్యంగా ఉన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తపోటు నివారణపై అవగాహన



యర్రగుంటపల్లి పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ఒత్తిడి తగ్గిస్తే రక్తపోటును అధిగమించవచ్చునని వైద్యాధికారి రాజేష్ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక రక్తపోటు సమస్య ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా మంది చిన్న వయసులోనే రక్తపోటుకు గురవుతున్నారన్నారు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి తదితర ప్రధాన కారణాలతో బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. జీవన శైలిలో మార్పు చేసుకుంటూ ఒత్తిడికి దూరంగా ఉంటే బీపీ, షుగర్ వంటి వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. గర్భిణులకు, ప్రతి నెలా పీఎంఎంఎస్‌వై క్యాంపులు నిర్వహిస్తూ అధిక రక్తపోటు ఉన్న వారిని హై రిస్క్‌గా గుర్తించి వారికి ప్రత్యేక సూచనలు సలహాలు ఇస్తూ , ఆహార అలవాట్లపై అవగాహన కల్పిస్తూ, ప్రత్యేక వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.గీత, పీహెచ్ఎస్ రమణమ్మ , ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్

జంగారెడ్డిగూడెం: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంతో విలువైన సమయాన్ని, డబ్బును ఆదాచేయవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టుల్లో కేసులు పెరగకుండా, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుంటే సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. కక్షిదారులకు సమ న్యాయం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శ్యామల, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విత్తనాలు రాజు, న్యాయవాదులు ఎం.నాగులు, ప్రతాప్, కృష్ణ, బల్లే సాయి కుమారి, బార్ మెంబర్లు పాల్గొన్నారు.

రేపు నూకాలమ్మ ఆలయ 5వ వార్షికోత్సవం



జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ ఆలయ కల్యాణ వేదిక ఉత్సవ మూర్తికి అభిషేకాలు నిర్వహించారు. హరే శ్రీనివాసా, శ్రీ నూకాంబిక కోలాట భజన మండలి వారు కోలాటం నేర్చుకుని, తొలుత అమ్మ వారి సన్నిధిలో గజ్జ పూజ చేసి, కోలాటం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివారం 5వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీ నూకాలమ్మ అమ్మ వార్లకు పంచామృతాలు, పుణ్యనదీజలాలు, 108 కలశాలతో, విశేష ద్రవ్యాలతో జలాభిషేకాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రత్యేక పూజలు చేసి ఏకాదశ హారతి పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గుంజవరంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ తులసి

బుట్టాయగూడెం: పిల్లల సమగ్ర అభివృద్ధిలో నైపుణ్యం సాధించి పాఠశాలకు సంసిద్ధులను చేసే విధంగా గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించినట్లు సీడీపీఓ ఈ. తులసి తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం సెక్టార్ పరిధిలోని టి. గుంజవరంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా తల్లిదండ్రులు పంపించాలని కోరారు. అలాగే కేంద్రాల్లో మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అన్నారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక దుస్తులు ధరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఎస్‌వి సత్యవతి, ఐటీసీ పథమ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఎన్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ మందిర్ పరిశీలన

ఉంగుటూరు: ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ని నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఆఫ్ హస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. తమిళనాడు నుంచి వచ్చిన పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఎస్ఆర్ డాక్టర్ బి కొత్త నయాగి, కమిటీ నోడల్ అధికారి డాక్టరు నీలిమ ఆసుపత్రి ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ప్రధానంగా రికార్డులు తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల శుభ్రత, మందులు, స్టాకు రిజిస్టరు, వైద్య విభాగాలను పరిశీలించారు. పంచకర్మ వైద్యం విభాగాన్ని పరిశీలించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు మంద జయలక్ష్మి, పీవీ పెద్దిరాజు ఆధ్వర్యంలో యోగా శిక్షణను గ్రామస్తులతో నిర్వహించారు. ఉంగుటూరు ఆయుర్వేద ఆసుపత్రి డాక్టరు కస్తూరి శిరీష్ కమిటీ సభ్యులకు సహకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి సత్కరించి గౌరవించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావు, పరిమి శీతారామ్, కొత్త నాగేశ్వరరావు, అంబటి నరిశింహమూర్తి పాల్గొన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

జాయింట్ కలెక్టర్, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: స్ట్రాంగ్ రూమ్‌లకు మూ డంచెల భద్రత ఏర్పాటు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూ రు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దెందులూరు నియోజకవర్గ ఈవీ ఎం ప్యాడ్స్ స్ట్రాంగ్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏపీఎస్పీ, ఏఆర్, కేంద్ర సాయుధ బలగాలతో స్ట్రాంగ్ రూం వద్ద భద్రత ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com